ఎంపికైన తైక్వాండో టీంతో కార్యదర్శి వెంకయ్య

తైక్వాండో జట్టు ఎంపిక

హనుమకొండ చౌరస్తా, నవంబర్ 11 : అమృతసర్‌లోని గురునానక్ దేవ్ యూనివర్సిటీలో జరిగే తైక్వాండో (మహిళా) ఆలిండియా జోన్ ఇంటర్ యూనివర్సిటీ పోటీల టీంను ఎంపిక చేసినట్లు విశ్వవిద్యాలయ స్పోర్ట్స్ బోర్డు కార్యదర్శి వెంకయ్య తెలిపారు. హనుమకొండ కాకతీయ డిగ్రీ కాలేజీ నుంచి శిరీష, తేజశ్విని, వరంగల్ వాగ్దేవి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ సైన్సు నుంచి శ్రావణి, జనగామ ఏకశిల డిగ్రీ కాలేజీ నుంచి రుద్ర, చెన్నూరు ప్రభుత్వ డిగ్రీ కాలేజీ నుంచి నాగలక్ష్మి, మహబూబాబాద్ నలంద డిగ్రీ కాలేజీ నుంచి తులసి ఉన్నట్లు తెలిపారు. వీరికి మహబూబాబాద్ నలంద డిగ్రీ కాలేజీ ఫిజికల్ డైరెక్టర్ రమేశ్ మేనేజర్‌గా వ్యవహరించనున్నట్లు చెప్పారు. కాగా, విద్యార్థులను వీసీ ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ మల్లారెడ్డి అభినందించారు.

భద్రకాళీ ఆలయంలో దీపాలు వెలిగిస్తున్న మంత్రి కొండా సురేఖ

భద్రకాళీ ఆలయాన్ని అభివృద్ధి చేస్తాం

వరంగల్ : భద్రకాళీ అమ్మవారిని రాష్ట్ర దేవాదాయ, దర్మాదాయ శాఖ మంత్రి సురేఖ దర్శించుకున్నారు. అనంతరం ఆలయ ఆవరణలో మహిళలతో కలిసి ఆమె దీపాలు వెలిగించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. భద్రకాళీ ఆలయాన్ని యాదగిరిగుట్ట తరహాలో అభివృద్ధి చేస్తామన్నారు. ఆలయ ఈవో శేషుభారతి, ప్రధాన అర్చకుడు శేషు పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్..

కాశీబుగ్గ, నవంబర్ 11 : టాస్క్‌ఫోర్స్ పోలీసులు సోమవారం ములుగు రోడ్డు సమీపంలోని వంగ విజయ్‌కుమార్ నివాసంలో పేకాడుతున్నారనే సమాచారం మేరకు దాడులు చేశారు. రూ.52వేలు నగదు, సెల్‌ఫోన్స్ స్వాధీనం చేసుకున్నారు. నరసింహా, ప్రభాకర్, పీటర్, అజయ్‌కుమార్, సురేందర్, లక్ష్మణ్, కుమార్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

110.5 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టివేత

నెక్కొండ, నవంబర్ 11 : నెక్కొండ టాస్క్‌ఫోర్స్, నెక్కొండ పోలీసులు సంయుక్తంగా దాడులు నిర్వహించి 110.5 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని సోమవారం పట్టుకున్నారు. నెక్కొండ ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. నమ్మదగిన సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్, పోలీసులు తనిఖీ చేయగా నెక్కొండలోని రాజీవ్‌నగర్‌లో ఎండీ పాషా రేషన్ బియ్యాన్ని అక్రమంగా నిల్వచేశాడని, వీటి విలువ రూ.2,76,250 ఉంటుందన్నారు. అక్రమంగా రేషన్ బియ్యాన్ని నిల్వచేసిన పాషాపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఆయన తెలిపారు.

గ్రామాల్లో గుప్పుమంటున్న గంజాయి

- ఏవోబీ నుంచి భారీగా దిగుమతి
- నాగ్‌పూర్ నుంచి సైతం రాక
- సరఫరాకు మైనర్లను వినియోగిస్తున్న వైనం
- వాట్సాప్, ఇన్‌స్టా సాయంతో ఆర్డర్లు

హనుమకొండ సబర్బన్, నవంబర్ 11 : గ్రామీణ ప్రాంతాల్లో నిషేధిత గంజాయి గత్తర లేపుతోంది. ఏ గ్రామంలో చూసినా గంజాయికి అలవాటు పడ్డ యువకులు కోకొల్లలుగా కనిపిస్తున్నారు. తక్కువ సమయంలోనే ఒంటికి మత్తు ఎక్కుతుండడంతో అనేక మంది యువకులు ఈ గంజాయికి అలవాటు పడుతున్నట్లు సమాచారం. అయితే పోలీసులు ఇటీవల గంజాయిని అరికట్టేందుకు నడుం బిగించినప్పటికీ విక్రయించే వారి నెట్‌వర్క్‌ను పూర్తి స్థాయిలో చేధించలేక పోతున్నారు. అయితే ఇటీవల కొందరు స్మోకర్లను అరెస్టు చేసిన సందర్భాల్లో పోలీసులకు విస్తుపోయే విషయాలు వెలుగు చూసినట్లు సమాచారం. ముఖ్యంగా గంజాయి తాగే వారిలో 8వ తరగతి చదివే విద్యార్థి మొదలుకుని డిగ్రీ చదివే విద్యార్థులు కూడా ఉన్నట్లు గుర్తించారు.

పలువురు పట్టుబడుతున్నా ఆగని దందా..

ముఖ్యంగా గంజాయి స్మగ్లర్లు గతంలో వరంగల్ ప్రాంతాన్ని కేవలం మహారాష్ట్రలోని నాగపూర్ లాంటి ప్రాంతాలకు రవాణా మార్గంగా మాత్రమే వినియోగించుకునే వారు. అంతకు ముందు నక్సల్స్ ప్రాబల్యం ఉన్న కాలంలో పరకాల సబ్ డివిజన్ పరిధిలో పలు గ్రామాల్లో పెద్ద ఎత్తున గంజాయి సాగు చేసేవారు. అయితే పండించిన పంటను ఇతర రాష్ట్రాల్లో విక్రయించే వారు గాని ఇక్కడ మాత్రం తాగేవారు కాదు. ఇప్పుడు ఇక్కడ పంట పండించకున్నా గంజాయి తాగే వారి సంఖ్య నిత్యం పెరుగుతూనే ఉంది. ప్రమాదాన్ని గుర్తించిన పోలీసులు నిరోధక చర్యలు మొదలు పెట్టినప్పటికీ ప్రయోజనం లేకుండా పోయింది. నిత్యం ఏదో ఓ చోట గంజాయి తాగే వారు దొరుకుతూనే ఉన్నారు. ఇదే కాకుండా ఇటీవల మడికొండ పోలీస్ స్టేషన్ పరిధిలో సింథటిక్ డ్రగ్‌గా చెప్పుకునే మిట్ అనే కొకైన్ లాంటి డ్రగ్ కూడా దొరికింది.

పోలీస్ స్టేషన్లలో ఉన్న డ్రగ్ డిటెక్షన్ కిట్

ఏవోబీ నుంచి అధికంగా..

గంజాయి ముఖ్యంగా ఆంధ్రా ఒడిషా బోర్డర్(ఏవోబీ) లోని పాడేరు ప్రాంతం నుంచి పెద్ద ఎత్తున దిగుమతి అవుతున్నట్లు తెలుస్తున్నది. అటవీ ప్రాంతంలో గిరిజనులు పెద్ద ఎత్తున గంజాయి సాగు చేసి కొందరు బ్రోకర్లకు విక్రయిస్తున్నారు. వారు పలు మార్గాల ద్వారా వరంగల్ నగరానికి, అక్కడి నుంచి గ్రామాలకు తరలిస్తున్నారు. ఇదే కాకుండా కొందరు పిల్లలు మహారాష్ట్రలోని నాగపూర్‌కు రైలు ద్వారా వెళ్లి అక్కడ వెయ్యి రూపాయలకు గంజాయి కొని తెచ్చుకుని ఇక్కడ రూ.5 వేలకు విక్రయిస్తున్నారు. ఇది మంచి ఆదాయ మార్గంగా ఉండడంతో ఆర్థికంగా వెనుకబడిన పిల్లలను కొందరు మంచి చేసుకుని గంజాయి రవాణాకు వినియోగించుకుంటున్నారు. ఇక వాట్సాప్, ఇన్‌స్టా లాంటి సామాజిక మాధ్యమాలను గంజాయి విక్రయాలకు వినియోంచుకుంటున్నట్లు తెలుస్తున్నది. విక్రయించే వారు, కావాల్సిన వారు ప్రత్యేక కోడ్ ద్వారా క్రయ, విక్రయాలను నడిపిస్తున్నారు. గంజాయి కావాల్సిన వారు స్కోర్ ఉందా అని మెసేజ్ చేస్తే విక్రయించే వారు స్కోర్ ఉంది అని సమాధానం ఇస్తారు.

పోలీసుల వైఫల్యమేనా?

జిల్లాలో విచ్చలవిడిగా గంజాయి అమ్మకాలు, వినియోగం కొద్ది నెలలుగా జరుగుతుంటే పోలీసులు గుర్తించలేక పోయారనే విమర్శలు వస్తున్నాయి. ఆలస్యంగా గుర్తించినప్పటికీ కొందరు అధికారుల వల్ల నిరోధించడంలో విఫలమయ్యారనే ఆరోపణలు కూడా వెల్లువెత్తుతున్నాయి. గంజాయి వినియోగిస్తున్న వారిని గుర్తించేందుకు ప్రతి పోలీస్ స్టేషన్‌కు డ్రక్ డిటెక్షన్ కిట్లను అందజేశారు. వాటిని ఆయా ఠాణాల్లో మూలన పడేశారనే విమర్శలున్నాయి. గతంలో భీమదేవరపల్లి మండలంలో విద్యార్థులు ఒక మామిడి తోటలో గంజాయి దావత్ చేసుకుని కొన్ని గంటల పాటు మత్తులో జోగిపోయిన ఉదంతాలు వెలుగు చూశాయి. ఆ తర్వాత విషయం తెలుసుకున్న స్థానిక పోలీసులు పిల్లల తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఇటీవల ఎల్కతుర్తి మండల పరిధిలో కొందరు గంజాయి స్మోకర్లను పట్టుకుని విచారణ జరిపి పెడ్లర్(మాదక ద్రావ్యాలు అమ్మే వ్యక్తి)ను గుర్తించి రిమాండ్‌కు పంపారు. ఆ తర్వాత సదరు పెడ్లర్‌ను కూడా వారి బంధువులు తీసుకు వచ్చి పోలీసులకు అప్పగించారు. అయితే తాను ఎక్కడి నుంచి గంజాయి తీసుకువచ్చి అమ్మకాలు చేస్తున్నారనే విషయాన్ని విచారణ చేయకుండానే గంటల వ్యవధిలోనే సదరు వ్యక్తిని అరెస్టు చూపించడం అనుమానాలకు తావిస్తున్నది. ఇదే కాకుండ కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ ప్రాంతం నుంచి ఇద్దరు వ్యక్తులను గంజాయి కేసులో వేలేరు పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు ప్రచారం జరిగింది. అయితే ఒక్కరిని మాత్రమే అరెస్టు చూపించారు. ఇలాంటి చర్యలు పోలీసుల నిజాయితీని ప్రశ్నించేలా ఉంటున్నాయనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.. ఏది ఏమైనా జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో గంజాయి విక్రయాలను అరికట్టడంలో మాత్రం అందరు పోలీసు అధికారులు చిత్తశుద్ధితో పని చేయడం లేదనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి.

ఎస్ఆర్ నగర్‌లో గుట్కాలు పట్టివేత

కాశీబుగ్గ, నవంబర్ 11 : ప్రభుత్వ నిషేధిత గుట్కాలు, అంబర్లు, ఇతర పొగాకు వస్తువులను అమ్ముతున్నట్లు పక్కా సమాచారంతో టాస్క్‌ఫోర్సు అధికారులు ఎనుమాముల పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం దాడులు చేసి స్వాధీనం చేసుకున్నారు. సుమారు రూ.30వేల 340 విలువైన పోగాకు వస్తువులను సీజ్ చేసినట్లు తెలిపారు. ఎస్ఆర్‌నగర్‌కు చెందిన గోపగాని చంద్‌ను అదుపులోకి తీసుకొని ఎనుమాముల పోలీసులకు అప్పగించినట్లు పేర్కొన్నారు. దాడుల్లో టాస్క్‌ఫోర్సు ఏసీపీ మధుసూదన్, సీఐ కే శ్రీధర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

ఇబ్బందులు పడుతున్న వాహనదారులు

ఆత్మకూరు, నవంబర్ 11 : మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై ముఖ్య కూడలి వద్ద విద్యుత్ అధికారులు నిర్లక్ష్యంగా ట్రాన్స్ ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. ఆత్మకూరు, బ్రహ్మణపల్లి, కామారం జంక్షన్ నుంచి నిత్యం వందలాది వాహనాలు వెళ్తుంటాయి. ఈ మూల మలుపుల వద్ద విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఉండడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. అంతేగాకుండా ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ ఎలాంటి రక్షణ కంచె ఏర్పాటు చేయలేదు. దీంతో పశువులు ట్రాన్స్‌ఫార్మర్‌ను తాకితే మృతిచెందే అవకాశమున్నదని పశువుల కాపాలదారులు ఆందోళన చెందుతున్నారు. పలు మార్లు విద్యుత్ అధికారులకు ఫిర్యాదు చెప్పినప్పటికీ పట్టించుకోవడం లేదని ఆ కాలనీ వాసులు, ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ట్రాన్స్ ఫార్మర్ చుట్టూ కంచె ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్

నెట్‌బాల్ పోటీల్లో జనగామ జిల్లాకు తృతీయ స్థానం

జనగామ చౌరస్తా, నవంబర్ 11 : నిర్మల్ జిల్లాలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి నెట్ బాల్ పోటీల్లో జనగామ జిల్లా క్రీడాకారులకు తృతీయ స్థానం లభించింది. మూడు రోజుల పాటు జరిగిన ఈ పోటీల్లో స్థానిక శాన్ మారియా హైస్కూల్ నుంచి తాటి నిహారికతో పాటు పలువురు బాలికలు గెలుపొందారు. ఈ సందర్భంగా బాలికలను పాఠశాల యాజమాన్యంతో పాటు తల్లిదండ్రులు, అభినందించారు.

తృతీయ స్థానం పొందిన జిల్లా క్రీడాకారులు

ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య

ఖిలావరంగల్, నవంబర్ 11 : ఉరేసుకొని ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన సోమవారం మిల్స్‌కాలనీ పోలీస్ సేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. స్థానికులు తెలిపిన కథనం ప్రకారం.. వర్ధన్నపేట మండలం అనంతారం గ్రామానికి చెందిన తైటు రవి(46) కుటుంబ కలహాల కారణంగా శంభునిపేటలో అద్దెకు ఉంటూ ప్లాస్టిక్ ప్లేట్లు, గ్లాసులు విక్రయించేవాడు. కాగా, ఇంటి అద్దె కోసం యజమాని తలుపులు తెరవగా ఉరి తాడుకు వేలాడుతూ కనిపించాడు. కుటుంబ సభ్యులకు, డయల్ 100 ఫోన్ చేసి సమాచారం చేరవేశాడు. పోలీసులు చేరుకొని విచారణ చేపట్టారు. ఆదివారం రాత్రి ఉరేసుకున్నట్లు పోలీసులు నిర్ధారించారు. మరింత సమాచారం తెలియాల్సి ఉంది.

డిజిటల్ తరగతులు ప్రారంభం

మడికొండ, నవంబర్ 11 : గ్రేటర్ 45వ డివిజన్ కుమ్మరిగూడెం ప్రభుత్వ పాఠశాలలో సోమవారం డిజిటల్ తరగతులను ప్రారంభించారు. బాల వికాస సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రెండు డిజిటల్ తరగతులు, ఆర్‌వో మంచినీరు, నూతన ఫర్నీచర్, ఎర్రబెల్లి ఉపేందర్‌రావు నిర్మించిన వాటర్ ట్యాంకును మనోజ్‌కుమాతో కలిసి సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సింగారెడ్డి శౌరిరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బాల వికాస 18 సంవత్సరాల నుంచి 550 ప్రభుత్వ పాఠశాలల్లో అనేక అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టిందన్నారు. 6 నెలల నుంచి ఒక విద్యా కమిటీని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 45వ డివిజన్ కార్పొరేటర్ ఇండ్ల నాగేశ్వర్‌రావు, మాజీ సర్పంచ్ రమేశ్, వల్లంపట్ల నాగేశ్వరరావు, హెచ్ఎం రవీందర్, బాల వికాస ఐటీ మేనేజర్ శివరాం, విద్యా కమిటీ చైర్మన్ కల్వచర్ల నవత, అమ్మ ఆదర్శ కమిటీ చైర్మన్ అరూరి కవిత పాల్గొన్నారు.

డిజిటల్ తరగతులను ప్రారంభిస్తున్న శౌరిరెడ్డి

విదర్భలో విజేతదే మహా పీఠం

- ఇక్కడ 62 అసెంబ్లీ నియోజకవర్గాలు
- ఈ ప్రాంతంలో పట్టు సాధిస్తే అధికారం పక్కా
- ప్రత్యేక దృష్టి సారించిన రెండు కూటములు

ముంబై, నవంబర్ 11(నమస్తే తెలంగాణ): మహారాష్ట్ర ఎన్నికలు సమీపిస్తున్న వేళ రెండు కూటములు విదర్భ ప్రాంతంపై ప్రత్యేకంగా దృష్టి సారించాయి. 62 నియోజకవర్గాలు ఉన్న విదర్భలో పాగా వేస్తే అధికారానికి దగ్గరైనట్టే అని కూటములు లెక్కలు వేసుకుంటున్నాయి. ఇక్కడి ప్రజలను ఆకర్షించి మెజార్టీ సీట్లు తమ ఖాతాలో వేసుకోవాలని తీవ్రంగా శ్రమిస్తున్నాయి. ఇప్పటికే రెండు కూటముల నుంచి అగ్రనేతలు విదర్భ మొత్తాన్ని చుడుతూ ప్రచారం చేస్తున్నారు. ఎక్కువగా పత్తి పండించే రైతులు ఉన్న ఈ ప్రాంతంలో రైతులు ఎటువైపు నిలుస్తారనేది గెలుపోటములను నిర్ణయించనుంది.

రెండు కూటములకూ కీలకం

విదర్భలోని మొత్తం 62 స్థానాల్లో బీజేపీ, కాంగ్రెస్ 36 స్థానాల్లో ప్రత్యక్షంగా తలపడుతున్నాయి. 11 జిల్లాలు కలిగిన విదర్భ ప్రాంతం 1990ల వరకు కాంగ్రెస్‌కు కంచుకోట. మూడు దశాబ్దాలుగా ఇక్కడ బీజేపీ – శివసేన కూటమి పట్టు పెంచుకుంది. 2014లో ఇక్కడ బీజేపీ ఒంటరిగా పోటీ చేసి 44 స్థానాలను గెలుచుకుంది. 2019లో 29 స్థానాలకు పడిపోయింది. ఇటీవలి లోక్‌సభ ఎన్నికల్లో మాత్రం మహా వికాస్ అఘాడీ(ఎంవీఏ) ఇక్కడ మంచి ఫలితాలను సాధించింది. విదర్భలోని 10 లోక్‌సభ స్థానాల్లో ఏడు స్థానాలను కైవసం చేసుకుంది. దీంతో అసెంబ్లీ ఎన్నికల్లో విదర్భలో పాగా వేసేందుకు ఎంవీఏ ప్రయత్నిస్తున్నది. ఆరెస్సెస్ కేంద్ర కార్యాలయం విదర్భలోనే నెలకొని ఉండటం, రాష్ట్ర బీజేపీకి జోడుగుర్రాల్లాంటి దేవేంద్ర ఫడ్నవీస్, చంద్రశేఖర్ బవాంకులే ఈ ప్రాంతానికి చెందిన వారే కావడంతో బీజేపీ ఈసారి విదర్భ ప్రాంతాన్ని ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నది.

మేఘాల్లోనూ మైక్రోప్లాస్టిక్

- పర్యావరణాన్ని ప్రభావితం చేస్తుండొచ్చు
- శాస్త్రవేత్తల ఆందోళన

న్యూఢిల్లీ: భూమిని మొత్తం ఆక్రమించేసిన మైక్రోప్లాస్టిక్స్ మేఘాల్లోకీ చేరాయని, ఇవి పర్యావరణాన్ని సైతం ప్రభావితం చేస్తుండొచ్చని శాస్త్రవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇందుకు సంబంధించి అమెరికాలోని పెన్సిల్వేనియా స్టేట్ యూనివర్సిటీకి చెందిన శాస్త్రవేత్తలు చేసిన ఓ అధ్యయనంలో కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఆకాశంలో మైక్రోప్లాస్టిక్‌లు మంచు కేంద్రక రేణువులుగా పని చేసి అసహజంగా మేఘాల ఏర్పాటుకు కారణమవుతున్నాయని శాస్త్రవేత్తలు గుర్తించారు. సాధారణంగా మేఘాలు ఏర్పడే పరిస్థితులు లేకపోయినా మైక్రోప్లాస్టిక్‌లు మేఘాలు ఏర్పడేలా చేస్తాయని పేర్కొన్నారు. ఈ విషయాన్ని నిర్ధారించడం కోసం పరిశోధకులు నాలుగు రకాల మైక్రోప్లాస్టిక్‌లను ప్రయోగశాలలో పరీక్షించారు. ఇందుకోసం నీటి బిందువులను చల్లబరిచి మంచుగా మార్చారు. మైక్రోప్లాస్టిక్ లేని నీటి బిందువులు మైనస్ 38 డిగ్రీల సెల్సియస్ వద్ద గడ్డ కట్టగా, 50 శాతం మైక్రో ప్లాస్టిక్‌లతో కలుషితమైన నీటి బిందువులు మైనస్ 22 డిగ్రీల సెల్సియస్ వద్దనే గడ్డ కడుతున్నట్టు తెలుసుకున్నారు. కాబట్టి మైక్రో ప్లాస్టిక్‌లు మేఘాల నిర్మాణాన్ని ప్రభావితం చేస్తున్నాయని అర్థమవుతున్నదని శాస్త్రవేత్త ప్రొఫెసర్ ఫ్రీడ్‌మన్ తెలిపారు.

ఇజ్రాయెల్‌పై హెజ్బొల్లా రాకెట్ల వర్షం

90కి పైగా క్షిపణుల ప్రయోగం • పలువురికి గాయాలు • ధ్వంసమైన వాహనాలు

బీరుట్, నవంబర్ 11: ఇజ్రాయెల్–హెజ్బొల్లా మధ్య పోరు మరింత తీవ్రరూపం దాల్చింది. లెబనాన్‌లోని హెజ్బొల్లా గ్రూప్ సోమవారం ఇజ్రాయెల్‌పై వరుస రాకెట్ దాడులతో విరుచుకుపడింది. ఇజ్రాయెల్ నగరం 'హైఫా' లక్ష్యంగా 90కిపైగా క్షిపణులను ప్రయోగించింది. ఈ దాడుల్లో హైఫాలో పలు భవనాలు దెబ్బతిన్నాయని, పలువురు గాయపడ్డారని, వాహనాలు ధ్వంసమయ్యాయని మీడియా కథనాలు పేర్కొన్నాయి. హెజ్బొల్లా ప్రయోగించిన పలు మిస్సైల్స్‌ను ఇజ్రాయెల్ రక్షణ వ్యవస్థ 'ఐరన్ డోమ్' అడ్డుకున్నప్పటికీ, మరికొన్ని హైఫాలో పలు జనావాస ప్రాంతాల్ని తాకాయని తెలిసింది. ఒక చిన్నారి సహా నలుగురు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారని ప్రాథమిక సమాచారం. హెజ్బొల్లా రాకెట్ దాడుల్ని ఇజ్రాయెల్ భద్రతా బలగాలు (ఐడీఎఫ్) ధ్రువీకరించాయి. హైఫా పట్టణం శివారు ప్రాంతాల్ని మిస్సైల్స్ తాకాయని ఐడీఎఫ్ పేర్కొన్నది.

హెజ్బొల్లా రాకెట్ దాడులతో ఇజ్రాయెల్‌లోని హైఫాలో దహనమవుతున్న కార్లు

శ్మశానం కింద హెజ్బొల్లా సొరంగం!

హెజ్బొల్లా సభ్యులు ఉపయోగించే సొరంగాలను ధ్వంసం చేసినట్టు ఇజ్రాయెల్ సైన్యం(ఐడీఎఫ్) ఆదివారం తెలిపింది. వీటిలో ఒకటి శ్మశానం కింద ఉందని ఆరోపించింది. కిలోమీటర్ పొడవున ఉండే ఈ సొరంగాలను గుర్తించామని ఎక్స్‌లో ఒక వీడియోను పోస్ట్ చేసింది. ఈ సొరంగాల్లో కమాండ్ అండ్ కంట్రోల్ రూమ్స్, నిద్రించే గదులు, ఆయుధగారాలు ఉన్నట్టు ఐడీఎఫ్ వెల్లడించింది. ఓ సొరంగంలో డజన్ల కొద్దీ ఆయుధాలు, ఇతర సైనిక సామగ్రి ఉన్న వీడియోను ఎక్స్‌లో పోస్ట్ చేసింది. 'ఉగ్రవాదుల అండర్ గ్రౌండ్ సొరంగాలను మా దళాలు ధ్వంసం చేశాయి. అందులో వ్యూహాత్మకంగా శ్మశానం కింద కూడా ఒకటి ఉంది. హెజ్బొల్లా మనుషులు చనిపోయినా, బతికున్నా వారికి విలువ ఇవ్వదు' అని ఐడీఎఫ్ విమర్శించింది.

ఇరాన్ రసాయన ఆయుధాల అభివృద్ధి!

ఇజ్రాయెల్ సైనికులు, పౌరులపై ప్రయోగించేందుకు ఇరాన్ రసాయన ఆయుధాల్ని సిద్ధం చేసిందన్న వార్తలు వెలువడ్డాయి. ఔషధ తయారీలో రసాయన ఏజెంట్స్‌గా వాడే సింథటిక్ ఓపియాయిడ్లు, ఫెంటానేల్.. వంటి వాటితో ఇరాన్ రసాయన ఆయుధాల్ని అభివృద్ధి చేసిందని అమెరికా రక్షణ రంగ నిపుణుడు మాథ్యూ లెవిట్ వెల్లడించారు. శక్తివంతమైన రసాయన ఏజెంట్స్‌తో గ్రనెడ్లు, బాంబులను ఇరాన్ తయారుచేసిందని, వీటి ప్రభావానికి లోనైతే.. బాధితుల నాడీ వ్యవస్థ కొన్ని క్షణాల్లో దెబ్బతింటుందని తెలిపారు. ఇజ్రాయెల్ సైన్యం, పౌరులు లక్ష్యంగా ఈ రసాయన ఆయుధాల్ని ప్రయోగించేందుకు ఇరాన్ తయారు చేసిందని చెప్పారు. దీనిపై ఆయన రాసిన ఆర్టికల్ చర్చనీయాంశమైంది. ఇరాన్ రసాయన ఆయుధాల తయారీని తక్కువ అంచనా వేయడానికి వీల్లేదని హెచ్చరించారు. రసాయన ఆయుధాల నుంచి వెలువడే పొగను ఒకసారి పీల్చిగానే, బాధితులు వెంటనే స్పృహ కోల్పోతారని, ఇజ్రాయెల్ సైనికులు, పౌరులను బందీలుగా చేసుకోవడానికి ఇరాన్ వాడొచ్చునని చెప్పారు.

హారిస్‌ను అధ్యక్షురాలిని చేయాలి

బైడెన్ వైదొలగాలని డిమాండ్లు

వాషింగ్టన్, నవంబర్ 11: అధ్యక్ష ఎన్నికల్లో కమలా హారిస్ ఓటమి డెమొక్రటిక్ నేతల్ని తీవ్రంగా నిరాశపర్చింది. ఎన్నికల్లో ఓడిపోయినా.. కమలా హారిస్‌ను ప్రెసిడెంట్‌ను చేయవచ్చునని డెమొక్రటిక్ నేత ఒకరు వ్యాఖ్యానించారు. ట్రంప్ అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించేవరకు కమలాహారిస్‌కు పదవి అప్పగించాలని ఆమె మాజీ కమ్యునికేషన్స్ వ్యవహారాల డైరెక్టర్ జమాల్ సిమన్స్ బైడెన్‌కు సూచించారు. 'జో బైడెన్ గొప్ప అధ్యక్షుడు. అయితే ఆయన చేసిన వాగ్దానం.. నెరవేర్చాల్సి ఉంది. తన పదవికి రాజీనామా చేసి, కమలా హారిస్‌కు బాధ్యతలు అప్పగించాలి. తద్వారా అమెరికాకు తొలి మహిళా అధ్యక్షురాలిగా కమలా హారిస్ నిలుస్తారు' అని అన్నారు. అమెరికా రాజ్యాంగం ప్రకారం, కొత్త అధ్యక్షుడిగా ట్రంప్ వచ్చే ఏడాది జనవరిలో బాధ్యతలు స్వీకరిస్తారు. దీనికి కొన్ని వారాల సమయముంది. అయితే బైడెన్ తన వాగ్దానాన్ని నెరవేర్చేందుకు మరో 30 రోజులు చాలని సిమన్స్ గుర్తుచేశారు.

ఉక్రెయిన్‌తో యుద్ధం తీవ్రం చేయొద్దు

- ఫోన్‌లో పుతిన్‌కు ట్రంప్ సూచన
- ఖండించిన క్రెమ్లిన్ వర్గాలు

వాషింగ్టన్: ఉక్రెయిన్‌తో చేస్తున్న యుద్ధం మరింత తీవ్రతరం చేసుకోవద్దని రష్యా అధ్యక్షుడు పుతిన్‌కు డొనాల్డ్ ట్రంప్ సూచించారట! యూరప్‌లో అమెరికా సైనిక ఉనికి గణనీయంగా ఉందన్న సంగతి పుతిన్‌కు గుర్తుచేశారట. ట్రంప్–పుతిన్ మధ్య ఫోన్ సంభాషణలు జరిగినట్టు అంతర్జాతీయ మీడియాలో సోమవారం వార్తా కథనాలు వెలువడ్డాయి. ఉక్రెయిన్ యుద్ధం సహా పలు విషయాలు ఇరువురు మధ్య ప్రస్తావనకు వచ్చినట్టు వార్తా కథనాలు పేర్కొన్నాయి. ఉక్రెయిన్ యుద్ధానికి ముగింపు ఎలా పలకాలన్నది వారిద్దరు మాట్లాడుకున్నారని 'వాషింగ్టన్ పోస్ట్' తెలిపింది. కాగా, వీటిని క్రెమ్లిన్ (పుతిన్ అధికార కార్యాలయం) వర్గాలు ఖండించాయి.

'బాకూ'లో మొదలైన కాప్-29

బాకూ, నవంబర్ 11: 'పారిస్ ఒప్పంద' లక్ష్యాలు ప్రమాదంలో పడ్డాయని, మరోవైపు 2024 ఏడాదిలో ఉష్ణోగ్రతలు సరికొత్త రికార్డులను చేరుకోనున్నాయని ఐక్యరాజ్యసమితి ఆందోళన వ్యక్తం చేసింది. ప్రపంచానికి పెను సవాల్‌గా మారిన వాతావరణ మార్పులను కట్టడి చేసేందుకు ఐక్యరాజ్యసమితి నిర్వహిస్తున్న 'కాన్ఫరెన్స్ ఆఫ్ పార్టీస్' (కాప్)–29 సదస్సు సోమవారం అజర్ బైజాన్ రాజధాని 'బాకూ'లో ప్రారంభమైంది. ఐరాస చీఫ్ గుటెరస్, ప్రపంచ వాతావరణ సంస్థ చీఫ్ సెలెస్టీ సాలో మాట్లాడుతూ, పర్యావరణ మార్పులపై ఆందోళన వ్యక్తం చేశారు. పారిస్ ఒప్పంద లక్ష్యాలను అందుకునేందుకు ప్రపంచ దేశాలు వీలైనంత తొందరగా కదలాలని, లక్ష్యాలను విడిచిపెట్టవద్దని సెలెస్టీ సాలో ప్రపంచ దేశాలను కోరారు. నవంబర్ 11 నుంచి 22 వరకు జరగనున్న 'కాప్' సదస్సుకు వివిధ దేశాల నాయకులు, పర్యావరణ నిపుణులు హాజరవుతున్నారు. పారిస్ వాతావరణ ఒప్పందం అమలు, కాలుష్య నియంత్రణ కోసం వర్ధమాన దేశాలకు ఆర్థిక సాయం వంటి కీలక అంశాలు చర్చకు రానున్నాయి. సదస్సును ప్రారంభిస్తూ సాలో కీలక వ్యాఖ్యలు చేశారు. మంచు కరిగి, సముద్ర మట్టాలు పెరుగుతున్నాయని, అనూహ్యమైన వాతావరణ పరిస్థితులు ఏర్పడుతున్నాయని, దీంతో ప్రపంచవ్యాప్తంగా సమాజం, ఆర్థికరంగంపై తీవ్ర ప్రభావం చూపుతున్నదని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు.

భగత్‌సింగ్ ఓ ఉగ్రవాది: పాక్

లాహోర్: బ్రిటిష్ వలస పాలకులపై వీరోచితంగా పోరాడి, ప్రాణ త్యాగం చేసిన భగత్ సింగ్ పట్ల పాకిస్థాన్‌లోని పంజాబ్ ప్రభుత్వం దురహంకారంతో వ్యవహరించింది. ఆయనను గౌరవించేందుకు తిరస్కరించింది. షడ్మన్ చౌక్‌కు భగత్ సింగ్ పేరు పెట్టడాన్ని, ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేయడాన్ని వ్యతిరేకించింది. భగత్ సింగ్‌ను ఉగ్రవాదిగా పేర్కొనడంపై ఆమ్ ఆద్మీ పార్టీ ఘాటుగా స్పందించింది. దీనిపై పాకిస్థాన్‌ను వివరణ కోరాలని భారత ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. బీజేపీ స్పందిస్తూ, పాకిస్థాన్ ఉగ్రవాదులకు